

స్వైప్-స్పెండ్-డిఫాల్ట్

తీద్దాం..వాడుదాం..ఎగ్గొడుదాం అన్న రీతిలో క్రెడిట్ కార్డు యూజర్లు

మిల్లేనియల్స్‌లో ఓ అలవాటుగా మారిన వైనం • సిబిల్ తాజా రిపోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: యువతలో పెరుగుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం పెడదారి పడుతున్నది. ఓ వైపు క్రెడిట్ స్కోర్లపై అవగాహనను పెంచుకుంటూనే.. మరోవైపు క్రెడిట్ కార్డులను విచ్చలవిడితనంతో వాడేస్తున్నారు. స్వైప్ చేద్దాం, ఎడాపెడా ఖర్చు పెడదాం, ఆ మొత్తాలను తిరిగి చెల్లించకుండా ఎగవేద్దాం.. అన్న రీతిలో చాలామంది క్రెడిట్ కార్డు యూజర్లు, ముఖ్యంగా మిల్లేనియల్స్ (1981-1996 మధ్య జన్మించినవారు) ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది మరి. ప్రముఖ క్రెడిట్ రేటింగ్ సమాచార సంస్థ, ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఒకింత విస్తుపోయే నిజాలే వెలుగుచూశాయి. బై నౌ, పే లేటర్ (ఇప్పుడు కొనండి, తర్వాత తీరిగ్గా చెల్లించండి) సంస్కృతికి యంగ్ మిల్లేనియల్స్ అలవాటు పడిపోయిన తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ-కామర్స్ వేదికలపై చేసే ఆన్‌లైన్ షాపింగ్‌ల్లో ఈఎంఐలతో జరుగుతున్న కొనుగోళ్లే ఎక్కువగా ఉండటాన్నిబట్టి పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రూ.2.7 లక్షల కోట్లకు

క్రెడిట్ కార్డులను సక్రమంగా వినియోగించుకుంటే ఎన్ని లాభాలున్నాయో.. దారితప్పితే అన్ని నష్టాలూ ఉన్నాయి. సిబిల్ వివరాల ప్రకారం క్రెడిట్ కార్డ్ డిఫాల్ట్స్ ఈ ఏడాది జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగాయి. 6 నెలల క్రితం ఇది 1.7 శాతంగా ఉండగా, గత ఏడాది మార్చిలో 1.6 శాతంగా ఉన్నది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే క్రెడిట్ కార్డుల బకాయిలు ఈ జూన్‌దాకా రూ.2.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. మార్చిలో రూ.2.6 లక్షల కోట్లుగా ఉన్నట్టు సిబిల్ తెలియజేసింది. నిరుడు మార్చిలో రూ.2 లక్షల కోట్లే. నిజానికి కరోనాకు ముందు 2019 మార్చిలో మొత్తం బకాయిలు రూ.87,686 కోట్లుగానే ఉన్నాయి. కానీ ఆ తర్వాతి ఐదేండ్లలో మూడింతలు ఎగిశాయి. చక్ర వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) 24 శాతంగా నమోదైంది. కాగా,

క్రెడిట్ కార్డుపైనున్న మొత్తం నగదు పరిమితిని యువత వాడేస్తున్నది. ఆన్‌లైన్ షాపింగ్‌లలో స్మార్ట్‌ఫోన్లు, బట్టలు, షూస్ కొనుగోళ్ల కోసం ఎక్కువగా క్రెడిట్ కార్డులనే యంగ్ మిల్లేనియల్స్ ఆశ్రయిస్తున్నారు. అనవసరపు ఖర్చులకు దిగుతూ.. తిరిగి వాటిని చెల్లించలేక చేతులెత్తేస్తున్నారు. చివరకు అవి మొండి బకాయిలుగా మారుతున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో గృహ రుణాల వంటి కీలకమైన ఆర్థిక సాయాన్ని పొందలేని పరిస్థితి వస్తున్నది. కాబట్టి క్రెడిట్ కార్డులు ఇస్తున్నారు కదా అని తీసుకోవద్దు. అవసరం ఉంటేనే తీసుకోవాలి. లేకపోతే వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది.

-సురేశ్ గణపతి, ఫైనాన్షియల్ రిసర్చ్ అనలిస్ట్

1-2 నెలలపాటు చెల్లించకపోతే బ్యాంకులు బకాయిలుగా భావిస్తాయి. ఆపై 6 నెలలపాటు చెల్లించకపోతే దాన్ని డిఫాల్ట్‌గా పరిగణిస్తాయి.

డిఫాల్టర్లపై చర్యలు ఇలా..

క్రెడిట్ కార్డు బకాయిల ఎగవేతదారులపై బ్యాంకులు తీసుకునే చర్యలను పరిశీలిస్తే..

1. న్యాయపరంగా

క్రెడిట్ కార్డును వాడుకుని, ఆ మొత్తాలను చెల్లించకపోతే బ్యాంకులు లీగల్ యాక్షన్స్ తీసుకోవడానికి అవకాశాలున్నాయి. సివిల్ స్యూట్ లేదా క్రిమినల్ కేసునూ పెట్టడానికి వీలున్నది. దీనివల్ల ఆర్థిక నష్టమేగాక, డిఫాల్టర్ ముద్ర అధికారికంగా పడుతుంది. చెల్లింపులు జరుపకపోతే జైలు శిక్షలకూ ఆస్కారం ఉన్నది.

2. డెబ్ కలెక్షన్ ఏజెన్సీలకు

తమ సొమ్మును తిరిగి వసూలు చేసుకోవడంలో భాగంగా డిఫాల్టర్ల వివరాలను డెబ్ కలెక్షన్ ఏజెన్సీ (రుణ వసూలు సంస్థ)లకు బ్యాంకులు అప్పగించే వీలున్నది. బకాయిల వసూళ్లలో ఈ ఏజెన్సీలు ఎటువంటి కఠిన చర్యలకు దిగుతాయో చూస్తూనే ఉన్నాం. డిఫాల్టర్లు ఒకవేళ పారిపోతే వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకూ తిప్పలు తప్పవు.

3. క్రెడిట్ స్కోర్ డౌన్

రుణగ్రహీతలు తమ అప్పులను సకాలంలో చెల్లించకపోతే వారి క్రెడిట్ స్కోర్ పడిపోతుంది. ఈ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే బ్యాంకులు, ఇతరత్రా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాల మంజూరు, వడ్డీరేట్లపై నిర్ణయం వంటివి చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారి ఎగవేతదారు ముద్రపడితే భవిష్యత్తులో మరే రకమైన రుణాల్నైనా అందుకోవడం చాలాకష్టతరం.

4. తక్కువ రుణ పరిమితి

ఒక బ్యాంక్‌లో క్రెడిట్ కార్డు బకాయిల ఎగవేతలకు పాల్పడినవారికి ఇతర బ్యాంకుల్లోనూ ఇబ్బందులు తప్పవు. క్రెడిట్ కార్డ్‌పై నుండే నగదు పరిమితి తగ్గిపోతుంది. ఆఫర్లూ పెద్దగా ఉండవు. ఇంకొన్ని బ్యాంకులైతే క్రెడిట్ కార్డులను ఇచ్చేందుకూ ముందుకు రావు.

రోల్స్-రాయిస్ కల్లినన్-2

ప్రారంభ ధర రూ.10.50 కోట్లు

చెన్నై, సెప్టెంబర్ 27: బ్రిటన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్-రాయిస్ కార్స్..దేశీయ మార్కెట్లోకి అల్ట్రా-లగ్జరీ కల్లినన్ సిరీస్-2 మాడల్‌ను పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.10.50 కోట్లు. అలాగే బ్లాక్ బ్యాడ్జ్ మాడల్ రూ.12.25 కోట్ల ప్రారంభ ధరతో లభించనున్నాయి. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి.

రికార్డుల నుంచి వెనక్కి

264 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ • 37 పాయింట్లు దిగిన నిఫ్టీ

ముంబై, సెప్టెంబర్ 27: స్టాక్ మార్కెట్ల ర్యాలీకి బ్రేక్ పడింది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకున్న సూచీల జోరుకు ఎట్టకేలకు బ్రేక్‌పడింది. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో వారాంతం ట్రేడింగ్‌లో సూచీలకు నష్టాలే మిగిలాయి. ఒక దశలో 86 వేల పాయింట్లకు చేరువైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్.. బ్లూచిప్ సంస్థల షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో భారీగా నష్టపోయింది. ఇంట్రాడేలో 85,978.25 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ చివరకు 264.27 పాయింట్లు నష్టపోయి 85,571.85 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు ఒత్తిడికి లోనుకావడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. మరోవైపు వరుసగా ఆరు రోజులుగా పెరుగుతూ వచ్చిన ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 37.10 పాయింట్లు కోల్పోయి 26,178.95 వద్ద స్థిరపడింది. ఈ భారీ నష్టాలను రిలయన్స్ షేరు కొంతమేర నిలువరించింది. ఈవారంలో సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు(1.21 శాతం), నిఫ్టీ 388 పాయింట్లు(1.50 శాతం) చొప్పున లాభపడ్డాయి.

టాప్‌లూజర్‌గా పవర్‌గ్రిడ్

విద్యుత్ సంస్థ పవర్‌గ్రిడ్ షేరు భారీగా నష్టపోయింది. కంపెనీ షేరు 3 శాతం నష్టపోవడంతో టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతో

పాటు భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్ యూఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, యాక్సిస్ బ్యాంక్, నెస్లె, టాటా మోటర్స్‌లు నష్టపోయాయి. కానీ సన్‌ఫార్మా, రిలయన్స్, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్, మారుతి, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, మహీంద్రా, ఐటీసీలు లాభాల్లో ముగిశాయి.

వరద బాధితుల సహాయార్థం నీతా అంబానీ తరపున సీఎం రేవంత్ రెడ్డిని కలుసుకొని ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20 కోట్ల విరాళానికి సంబంధించిన చెక్కును అందజేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు. అలాగే భారత్ బయోటెక్ కూడా కోటి రూపాయల విరాళాన్ని అందించింది.

సెయిల్‌లో వైజాగ్ స్టీల్ విలీనం!

కేంద్రప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: ఆర్థిక నష్టాల్లో కొనసాగుతున్న ప్రభుత్వరంగ స్టీల్ ఉత్పత్తి సంస్థ రాష్ట్రీయా ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(వైజాగ్ స్టీల్) విక్రయ ప్రతిపాదనపై కేంద్ర సర్కార్ వెనక్కి తగ్గింది. కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మోదీ సర్కార్ మరో ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఈ వైజాగ్ స్టీల్‌ను మరో ప్రభుత్వరంగ సంస్థయైన సెయిల్‌లో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి సెయిల్‌లో విలీన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అలాగే వైజాగ్ స్టీల్‌కు ఉన్న 2వేల ఎకరాల భూములను సైతం ఎన్ఎండీసీకి విక్రయించడంతోపాటు సంస్థకు ఉన్న బ్యాంక్ రుణాలకు శాశ్వత పరిష్కారం సూచించబోతున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా డీఎఫ్ఎస్ కార్యదర్శి, స్టీల్ సెక్రటరీతోపాటు బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైజాగ్ స్టీల్‌కు అత్యధికంగా రుణం ఇచ్చింది ఎస్బీఐ కావడం విశేషం. విశాఖపట్నంలో సంస్థకు 75 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి కలిగిన ప్లాంట్ ఉన్నది. ఉక్కు పరిశ్రమకు సొంతంగా గనులు లేకపోవడం వల్లనే నష్టాలు వస్తున్నాయని కార్మిక సంఘాలు ప్రధానంగా ఆరోపిస్తున్నాయి.

మారిన మార్కెట్ ఫీజులు

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అక్టోబర్ 1 నుంచి అమల్లోకి

ముంబై, సెప్టెంబర్ 27: క్యాష్ మార్కెట్, ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ సెగ్మెంట్లలో లావాదేవీ ఫీజులను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు శుక్రవారం సవరిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఆదేశానుసారం స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఎన్ఎస్ఈ వివరాల ప్రకారం క్యాష్ మార్కెట్‌లో లావాదేవీ ఫీజు ట్రేడెడ్ వాల్యూలో లక్షకు రూ.2.97 చొప్పున ఉంటుంది. ఇక ఈక్విటీ డెరివేటివ్స్‌లోనైతే ఫ్యూచర్స్ సెగ్మెంట్‌కు ట్రాన్జాక్షన్ ఫీ.. ట్రేడెడ్ వాల్యూలో లక్షకు రూ.1.73గా ఉన్నది. అదే ఆప్షన్స్ సెగ్మెంట్‌కు ప్రీమియం వాల్యూలో లక్షకు రూ.35.03గా ఉన్నట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. అలాగే కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ఫ్యూచర్స్ కోసం లావాదేవీ ఫీజును ట్రేడెడ్ వాల్యూలో లక్షకు 35 పైసలుగా నిర్ణయించినట్టు పేర్కొన్నది. ఆప్షన్స్-ఇంట్రెస్ట్ రేట్ ఆప్షన్స్‌లోనైతే ప్రీమియం వాల్యూలో లక్షకు ఈ ఫీజు రూ.31.1గా ఉన్నది. బీఎస్ఈ వివరాల ప్రకారం కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్, ఫ్యూచర్స్ కాంట్రాక్ట్స్ (క్రాస్-కరెన్సీ ఫ్యూచర్స్ సహా)ల్లో టర్నోవర్ వాల్యూలో కోటికి రూ.45గా చార్జీని నిర్ణయించారు. ఆప్షన్స్ (క్రాస్-కరెన్సీ ఆప్షన్స్‌సహా)ల్లో ప్రీమియం టర్నోవర్ వాల్యూలో కోటికి రూ.100గా ఫీజు ఉంటుంది. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ కోసం సెన్సెక్స్, బ్యాంకింగ్ ఆప్షన్స్ కాంట్రాక్ట్స్‌కూ సవరించిన ఫీజులే వర్తిస్తాయి.

హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టండి

మైన్‌ఎక్స్‌పో ఇంటర్నేషనల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఐటీ, పునరుత్పాక విద్యుత్, వస్తు ఉత్పత్తిలో పురోగమిస్తున్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని అమెరికన్ కంపెనీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. అమెరికాలో గురువారం జరిగిన మైన్‌ఎక్స్‌పో సదస్సులో ఆయన అంతర్జాతీయ, అమెరికన్ కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్, యాపిల్ లాంటి దిగ్గజ సంస్థల పెట్టుబడులతో హైదరాబాద్ గ్లోబల్‌సిటీగా, ఇన్నోవేషన్ సెంటర్‌గా రూపుదిద్దుకున్నదని, తమ ప్రభుత్వం వ్యాపార అనుకూల విధానాలను అవలంభిస్తున్న నేపథ్యంలో విరివిగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న ఫ్యూచర్‌సిటీలో ఐటీ, కృత్రిమ మేధస్సు, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు విరివిగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ అవకాశాన్ని ఇంటర్నేషనల్ కంపెనీలు వినియోగించుకోవాలని సూచించారు.

థామ్సన్ పండుగ ఆఫర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఫ్రెంచ్‌నకు చెందిన గృహోపకరణాల తయారీ సంస్థ థామ్సన్..పండుగ ఆఫర్లను ప్రకటించింది. స్మార్ట్ టీవీలు, వాషింగ్‌మెషిన్లు, స్పీకర్లను తగ్గింపు ధరకే అందిస్తున్నట్లు ప్రకటించింది. రూ.5,999 ప్రారంభ ధరకే స్మార్ట్ టీవీని అందిస్తున్న సంస్థ..రూ.12,999 ప్రారంభ ధరతో వాషింగ్‌మెషిన్లను విక్రయిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత పండుగసీజన్‌లో ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు ప్రత్యేకంగా బిగ్ బిలియన్ డేస్‌లను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన ఈ ఆఫర్లు వచ్చే పది రోజుల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అలాగే థామ్సన్ ఆండ్రాయిడ్ టీవీలను కొనుగోలు చేసిన వారికి మూడు నెలల పాటు ఓటీటీ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపింది.